
ప్రజాశక్తి

గురువారం 22 ఆగస్టు 2024



గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - భోగాపురం



గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాల డిఐజి గోపీనాథ్ అన్నారు. భోగాపురం పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులకు సంబంధించిన రికార్డులన పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సిఐ ప్రభాకర్, ఎస్ఐ సూర్య కుమారికి సూచించారు. గంజాయిని నిర్మూలించేందుకు గట్టి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట డిఎస్‌పి గోవిందరావు పాల్గొన్నారు.

కౌలురైతులందరికీ రుణాలివ్వాలి

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి - విజయనగరం కోట



బ్యాంకర్లు, వ్యవసాయాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

జిల్లాలోని కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులను జారీ చేసి, శతశాతం రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. బ్యాంకర్లు, వ్యవసాయాధికారులతో కౌలు రైతుల రుణాలపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15,500 సిసిఆర్‌సి కార్డులను రైతులకు అందించాల్సి ఉండగా, ఇప్పటికే 14,860 కార్డులు (95.5శాతం) అందజేశామన్నారు. మిగిలిన కార్డులను రెండు రోజుల్లో అందజేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. మండలాల వారీగా పెండింగ్ ఉన్న గుర్తింపు కార్డులపై మండల వ్యవసాయాధి కారులతో సమీక్షించారు. విఎఒలు, విఆర్ఒలు, సర్వేయర్లతో సమీక్షించి, మిగిలిపోయిన కౌలు రైతుల జాబితాలను రెండు రోజుల్లో ఖరారు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు.

ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులకు రూ.70 కోట్లు రుణాలను మంజూరు చేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు రూ.3.26 కోట్లు మాత్రమే మంజూరు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్రాంచ్‌ల వారీగా ఇంతవరకు ఏయే బ్యాంకులు ఎంత మొత్తం రుణాలను ఇచ్చిందీ సమీక్షించారు. రైతులకు ఈ సీజన్‌లోనే శతశాతం రుణాలను అందించేలా బ్యాంకులు ముందుకు రావాలని ఆదేశించారు. రైతుల నుంచి వచ్చిన ధరఖాస్తులను రెండు రోజుల్లో అన్ని బ్యాంకులకు పంపించాలని, వారం లోపలే వాటిని పరిశీలించి, అర్హుల జాబితాను తయారు చేయాలని బ్యాంకులకు సూచించారు. రుణాల మంజూరుపై ప్రతీరోజూ సమీక్షించాలని ఎల్‌డిఎంను కలెక్టర్ ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ, ప్రతీ సోమవారం మధ్యాహ్నం కౌలు రుణాలపై బ్యాంకర్లు, వ్యవసాయాధికారులతో సమీక్షిస్తానని, పూర్తి సమాచారంతో తప్పకుండా హాజరు కావాలని చెప్పారు. సకాలంలో రుణాలను మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వి.తారకరామారావు, నాబార్డు డిడిఎం నాగార్జున, ఎల్‌డిఎం మూర్తి, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ వైవి రమణ, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, ఎడిఎలు, బ్యాంకర్లు, వెబెక్స్ ద్వారా తహశీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

నగరంలో పెరుగుతున్న ఆక్రమణలు

- లక్షలు విలువ చేసే మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించేందుకు కంటైనర్ డ్రామాలు
- నగర పాలక సంస్థ అధికారుల తీరుపై మండిపడుతున్న స్థానికులు, కార్పొరేటర్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఆక్రమించుకోవడానికి కాదేదీ అనర్హం అన్న చందంగా నగరంలో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. భూమి ఖాళీగా కనిపిస్తే చాలు గెడ్డలు, చెరువులు, ఖాళీ స్థలాలు అని చూడకుండా ఆక్రమణల జోరు పెరిగిపోయింది. గత వైసిపి పాలనలో ఇటువంటి చర్యలు కారణంగానే వైసిపి పాలకులకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటుతో ప్రజలు సమాధానం చెప్పారు. అయినా వారి దగ్గర నేర్చుకున్న పాఠాలు మరచిపోని కొంతమంది ఇప్పటకీ ఖాళీ స్థలం కనిపిస్తే దానిని ఎలా కబ్జా చెయ్యాలని చూస్తున్నారు. అటువంటి ఆక్రమణలో ఒకటి అలకనంద కాలనీలో బయటకు వచ్చింది.

సుమారు రూ.70 లక్షలు విలువ చేసే నగర పాలక సంస్థకు చెందిన భూమిని ఆక్రమించేందుకు కంటెయినర్‌ను పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటకే కంటెయినర్ పెట్టి ఆక్రమించిన స్థలంపై అలకనంద కాలనీకి చెందిన మహిళా సోమవారం జరిగే ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. తన స్థలం పక్కనే మున్సిపల్ స్థలంలో కంటెయినర్ పెట్టి ఆక్రమించేందుకు ఎవరో ప్రయత్నిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. తన స్థలం పక్కనే కంటెయినర్ పెట్టడం వల్ల తాను ఇంటి నిర్మాణానికి ఇబ్బంది పడుతున్నానని వెంటనే దాన్ని తొలగించాలని కోరారు. అయితే కలెక్టర్‌తో పాటు, అలకనంద కాలనీకి చెందిన కార్పొరేటర్ ప్రభాకర్ కూడా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు చెప్పినా చర్యలు తీసుకోలేదని విమర్శలు వినవస్తున్నాయి. మరో వైపు ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన నగర పాలక సంస్థ అధికారులు కంటెయినర్ ఉండటం వాస్తవం అయితే ఇంటి నిర్మాణం చేసినపుడు కంటెయినర్ తీసేస్తామని చెప్పి పిర్యాదు ధారునికి సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే పేదలు ఆక్రమించారని తెలిస్తే బుల్డోజర్‌తో వెళ్లి ఇల్లులు కూల్చిన నగర పాలక సంస్థ అధికారులు తీరు, డబ్బున్న వారికి ఒక న్యాయం పేదలకు ఒక న్యాయం చేస్తారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో ఉన్నారని చెప్పి 30 ఏళ్లుగా నివాసం ఉన్న కంటోన్మెంట్ ఇళ్లను బుల్డోజర్‌తో తొలగించిన అధికారులు ఇప్పుడు మున్సిపల్ స్థలంలో కంటెయినర్ పెట్టి ఆక్రమిస్తే ఎందుకు ఉదాసీనత వ్యక్తం చేస్తున్నారో, ఎవరికి మున్సిపల్ స్థలాన్ని కట్టబెట్టాలని చూస్తున్నారోనని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే విషయం పై వార్డు కార్పొరేటర్ కూడా స్పందించారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని కాలనీ వాసులు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారని తాను కూడా టౌన్ ప్లానింగ్ అధికారులకు చెప్పానని అయితే ఎటువంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తి అధికారులను ప్రశ్నిస్తానన్ని మీడియాకు తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి మున్సిపల్ స్థలాన్ని కాపాడాలని, లేకుంటే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టేందుకు కాలనీ వాసులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



మున్సిపల్ స్థలంలో పెట్టిన కంటైనర్

ఎంఆర్ కళాశాలలో 'జనంలోకి మనం'

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

మహారాజ కాలేజీ సెమినార్ హాల్లో పోస్టల్ డిపార్టుమెంటు డాక్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం ద్వారా 'జనం లోకి మనం' అనే కార్యక్రమాన్ని బుధవారం విజయవంతంగా నిర్వహించింది. దీనిలో భాగంగా పోస్టల్ డిపార్టుమెంటు పథకాలు ప్రజలు ఏ విధంగా అన్ని అవసరాలు తీసుస్తాయో అనే విషయాలు ఎఎస్‌పి సుందర నాయుడు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే తపాలా శాఖ సేవలను, ప్రజలకు అందిస్తున్న సేవలను, తపాలా శాఖలో ప్రజలకు తక్కువ మొత్తంలో దాచుకుంటే వచ్చే ఆదాయం, సొమ్ముకు గ్యారంటీ వంటి విషయాలను వివరించారు. తపాలా శాఖలో పొదుపు బంగారు భవిష్యత్‌కు మార్గమన్నారు. కార్యక్రమంలో ఐపిపిబి మేనేజర్ సతీష్, పిఆర్ఐ ఇ.మధు, మహారాజ కాలేజీ తరపున సత్యనారాయణ పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి : సిఐటియు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

కలకత్తాలో జూనియర్ డాక్టర్ మౌమితపై అత్యాచారం చేసి అత్యంత కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిసిసి సోప్ యూనిట్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎ. జగన్మోహన్‌రావు, నాయకులు సంతు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా డాక్టర్లు, ప్రజాతంత్ర వాదులు చేస్తున్న ఉద్యమాలను సుమోటోగా తీసుకొని సుప్రీంకోర్టు దర్యాప్తు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ, పోలీస్ యంత్రాంగం వైఫల్యం ఈ దర్యాప్తులో బట్టబయలు అయిందని, ఆధారాలను తారుమారు చేసేందుకు బెంగాల్ ప్రభుత్వం ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిరసన కారులకు కూడా రాజకీయాల ఆపాదించడం సిగ్గుచేటు అని అన్నారు. ఇప్పటికైనా డాక్టర్ మౌనిత కుటుంబానికి న్యాయం చేయాలని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శేషు, రమణమ్మ, స్వామి, నాయుడు, సురేష, భారతి తదితరులు పాల్గొన్నారు

నెలాఖరులోగా ప్లాస్టిక్ నియంత్రణ

1 నుంచి అపరాధ రుసుము వసూలు : కమిషనర్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

నెలాఖరులోగా ప్లాస్టిక్ విక్రయం నగరంలో లేకుండా చూడాలని, సెప్టెంబర్ 1 నుంచి ప్లాస్టిక్ అమలు చేస్తే అపరాధ రుసుము విధిస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు అన్నారు. బుధవారం నగరంలో వ్యాపార సంస్థలు అధినేతలతో నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు ప్లాస్టిక్ పగడ్బంధిగా అమలకు చర్యలు చేపడతామన్నారు. నెలాఖరులోగా ప్లాస్టిక్ నియంత్రణ పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏదైతే నిర్దేశిత ప్లాస్టిక్ అమలు చేయాలని చెప్పిందో వాటిని తప్ప మిగిలిన ప్లాస్టిక్ కవర్లు నియంత్రణ పక్కగా అమలు చేయాలన్నారు. వాతావరణంలో ప్లాస్టిక్ వల్ల మార్పులు రావడం, కొత్త కొత్త వ్యాదులు రావడం జరుగుతుందన్నారు. ప్రధానంగా క్యాన్సర్ వంటి వ్యాదులు ఎక్కువుగా వస్తున్నాయన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా, పర్యావరణ దృష్ట్యా నగర పాలక సంస్థలో ఉన్న వ్యాపారులఅందరూ ప్లాస్టిక్ నియంత్రణ చెయాల్సిందేనన్నారు. ప్లాస్టిక్ నియంత్రణ పాటించకపోతే ఎంత పెద్ద వారి ద్వారా సిఫార్సు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాయుడు

నగరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంహెచ్ఒ సాంబమూర్తి, నగరంలో వ్యాపారులు పాల్గొన్నారు.

క్యూఆర్ విధానంలో చెల్లింపులకు అవకాశం

నగరపాలక సంస్థలో చెల్లింపులు ఇక నుంచి క్యూఆర్ కోడ్ విధానంలో ఫోన్‌పే, ఆన్లైన్ పేమెంట్లు చేసుకునే పద్ధతి అమల్లోకి తెచ్చినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. బుధవారం క్యూఆర్ కోడ్ విధానం ఏ విధంగా అమలు అవుతుందో పరిశీలించారు. బ్యాంకు, గణాంక అధికారులు ప్రయోగాత్మకంగా చేపట్టిన క్యూఆర్ కోడ్ విధానం విజయవంతమైందని దీంతో ఇక నుండి నగరపాలక సంస్థకు ప్రజలు చెల్లించాల్సిన ఆస్తి పన్నులు, నీటి పన్నులు తదితర చెల్లింపులు క్యూఆర్ కోడ్ విధానంలో ఫోన్పే ద్వారా గాని ఆన్లైన్ ద్వారా గాని చెల్లించుకోవచ్చని కమిషనర్ తెలిపారు. ప్రజల సౌలభ్యం కోసం అమల్లోకి తెచ్చిన ఈ విధానాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.



మాజీ సిఎం జగన్‌ను కలిసిన మాజీ మంత్రి బొత్స, జిల్లా నాయకులు,

జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ బొత్స

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన అనంతరం ప్రమాణ స్వీకారం చేసేముందు వైఎస్ జగన్‌ను బొత్స సత్యనారాయణ బుధవారం ఉదయం కలిశారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభినందించారు. బొత్సతో పాటు జగన్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎమ్మెల్యేలు ఆర్ మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు, విశాఖ, విజయనగరం జెడ్పి చైర్మన్లు జల్లి సుభద్ర, మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కారుమూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అదీప్ రాజ్, భాగ్యలక్ష్మి, కడుబండి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, శోభ హైమావతి, ఉత్తరాంధ్ర సీనియర్ నేతలు ఉన్నారు.

శాసన మండలి ప్రతిపక్ష నేతగా బొత్స

శాసన మండలి ప్రతిపక్ష నేతగా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఆయన స్థానంలో లేళ్ల అప్పిరెడ్డి శాసన మండలి ప్రతిపక్ష నేతగా ఉండేవారు. ఆయన రాజీనామ చేయడంతో ఆ బాధ్యతలను బొత్సకు అప్పగించారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌పి వకీల్ జిందాల్

మోటార్ వెహికల్ యాక్ట్ అమలు చేయాలి

జిల్లా ఎస్‌పి వకీల్ జిందాల్

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఆటో డ్రైవర్లు మోటార్ వెహికల్ చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎస్‌పి వకీల్ జిందాల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న మెసానిక్ టెంపుల్లో ఆటో డ్రైవర్లకు మోటార్ వెహికల్ యాక్ట్ అమలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో స్టాండ్‌లో మాత్రమే ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. ఓవర్ లోడింగ్ ఆటోలకు ప్రమాదాలు జరిగితే పూర్తి భాద్యత ఓనర్లదేనన్నారు. స్కూల్ పిల్లలు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. లైసెన్సు లేకుండా ఎవరూ ఆటోలు నడపరాదన్నారు. ఆటోలకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ పొల్యూషన్ ఇతర ఇతర పత్రాలు కచ్చితంగా ఉండాలన్నారు. టౌన్‌లో ఎత్తి బ్రిడ్జి, ఆర్‌టిసి కాంప్లెక్స్, కోట ప్రధాన కూడలి వద్ద ఎక్కువగా ట్రాఫిక్ ఉంటుందని వాటి వల్ల ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మీ కళ్ళ ముందు మీ ఆటోలో వెనక సీట్లో ఈవిటేజింగ్ ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. అలా కాకుండా ప్రోత్సహిస్తే మీ పైన కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు పాటించని ఆటోలను సిజ్ చేయాలని పోలీసులకు ఆదేశాలిచ్చారు. రోడ్ సేఫ్టీ మెంబర్ ఎం.అప్పారావు, ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ లోక్ అదాలత్ కేసుల్లో తామే ఎక్కువుగా ఉన్నామని పాత వాటిని ఎత్తిచూపుతున్నారని ఎస్‌పికి వివరించారు. ఆటోలలో ఎవరు ఎటువంటి వస్తువులు విడిచిపెట్టినా వారికి పోలీస్ శాఖ ద్వారా అప్పజెబుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

25న జిల్లా అథ్లెటిక్స్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

వచ్చేనెల 14, 15, 16 తేదీల్లో గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరుగు రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీలు కోసం జిల్లా జట్టు ఎంపిక ఈ నెల 25వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరుగనుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి లీలాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు వయస్సు 14, 16, 18, 20 సంవత్సరాలు ఉండాలన్నారు. 16, 18, 20 సంవత్సరాల వయస్సు గలవారు టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ ఒరిజినల్ పట్టుకొని రావాలని, బిలో 16 వయసు గలవారు తహశీల్దార్ ద్వారా వయసు ధ్రువీకరణ పత్రం సర్టిఫికెట్ పట్టుకుని రావాలన్నారు.



బొబ్బిలిలోని వసతిగృహంలో వంటలను పరిశీలిస్తున్న పీడీ శాంతకుమారి

శిశు సంరక్షణా కేంద్రాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- విజయనగరంకోట/బొబ్బిలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు జిల్లాలోని శిశు సంరక్షణా కేంద్రాలను, బాలల అనాధ శరణాలయాలను ఐసిడిఎస్ అధికారులు, జిల్లా బాలల సంరక్షణా విభాగం సిబ్బంది బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ ఆశ్రమాలలో పిల్లలకు అందిస్తున్న ఆహారం, తాగునీరు, వసతి సౌకర్యాలు, విద్య, ఆరోగ్యం, రక్షణ, భద్రతా విషయాలను, పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. వీటికి జెజె యాక్ట్ ప్రకారం అనుమతులు తీసుకున్నదీ లేనిదీ తనిఖీ చేశారు. అనుమతి లేకుండా ఆశ్రమాలను నడపకూడదని స్పష్టం చేశారు. తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విజయనగరం పట్టణంతోపాటు, బొబ్బిలి తదితర ప్రాంతాల్లో కూడా ఈ తనిఖీలు జరిగాయి. కణపాకలోని నవజీవన్ హాస్టల్, కెఎల్‌పురం వద్ద మిరియం హోం, కామాక్షినగర్, నల్లమారమ్మ గుడివద్ద అనధికారికంగా ఆశ్రమాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించి, హెచ్చరించారు. ఈ తనిఖీల్లో స్త్రీశిశు సంక్షేమశాఖ పథక సంచాలకులు బి.శాంతకుమారి, ఇన్‌ఛార్జి డిసిపిఒ వై.నాగరాజు, పిఒ బి.రామకోటి, కౌన్సిలర్ వెన్నెల సంధ్య తదితరులు పాల్గొన్నారు.



ఇసుక రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ఇసుక అమ్మకాల్లో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు : జెసి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇసుక అమ్మకాల్లో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. గ్రోత్ సెంటర్లో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను బుధవారం పరిశీలించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఇసుక అమ్మకం రికార్డులను పరిశీలించారు. జిల్లా వినియోగదారులకు మాత్రమే ఇసుక ఇవ్వాలని, ఇతర జిల్లాలకు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విశాఖ జిల్లాకు ఇసుక వెళ్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, విశాఖ జిల్లా లారీలను ఇసుక ఇవ్వవద్దని కోరారు. ఇసుక కోసం వచ్చే వారి ఆధార్ కార్డు, వాహనం నెంబర్, ఫోన్ నెంబర్ రికార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. ఇసుక నిల్వలపై తహశీల్దార్ శ్రీనును ప్రశ్నించగా 45వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్లు చెప్పారు. ఇసుక సరఫరాపై ఆర్డిఓ సాయిశ్రీకు పలు సూచనలు చేశారు. ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని ఎస్.ఇ.బి ఎస్.ఐ ఎస్వీ రామారావు, మైనింగ్ అధికారులను ఆదేశించారు.

వ్యాధులపై అప్రమత్తం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - రామభద్రపురం

సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి భాస్కరరావు సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుదవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీరోజూ ఆయా సబ్ సెంటర్ల పరిధిలోని గ్రామాలకు వెళ్లి అంటు రోగాలు, జ్వరాలపై ఆరా తీయాలని సూచించారు. అపారిశుధ్యాన్ని నిర్మూలించడానికి గ్రామ పంచాయతీలు భాగస్వామ్యం కావాలన్నారు. ఆసుపత్రిలో ప్రసావాలపై ఆరా తీశారు. మందులు ఏ మేరకు సిద్ధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా కృషి చేయాలన్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి సిబ్బంది తమవంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి రత్న దీపక్, ఈవో మల్లికేశ్వరరావు, ఫార్మసిస్టు పొట్టా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సిఐలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణ సిఐగా కె.సతీష్‌కుమార్, రూరల్ సిఐగా నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావును విఆర్‌కు బదిలీ చేయడంతో రిషికొండ మెరైన్ సిఐగా పని చేస్తున్న కె.సతీష్ కుమార్, రూరల్ సిఐ ఎస్.తిరుమలరావు గత నెల 31న ఉద్యోగ విరమణ చేయడంతో నారాయణరావు సిఐలుగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సిఐలు ఎమ్మెల్యే బేబినాయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డిఎస్‌పి పి.శ్రీనివాసరావును కలిశారు. శాంతిభద్రతలు పరిరక్షణకు పని చేస్తామని నూతన సిఐలు చెప్పారు.

ప్రభుత్వ భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయ గ్రామంలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న గదుల్లోకి బుధవారం మార్చారు. ఇటీవల అద్దె కొంపల్లోనే అంగన్‌వాడీ భవనాలు అనే కథనం ప్రజాశక్తిలో ప్రచురితమవడం, మండల సమావేశంలో కూడా ఈ విషయంపై సర్పంచ్ నిరుజోగి వెంకటరావు అధికారులను ప్రశ్నించడంతో స్పందించారు. దీంతో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాల భవనంలోకి మార్చారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - వేపాడ

బాలికలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి అని ఎస్‌కోట రూరల్ సిఐ కె. రవికుమార్ అన్నారు. మండలంలోని బక్కు నాయుడుపేట కెజిబివి బాలికల వసతి గృహంలో విద్యార్థులకు చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండటం చాలా మంచిదన్నారు. ప్రభుత్వ పరంగా మహిళలకు ఏ విధమైన రక్షణ కలుగుతుందోనన్న విషయాలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం ఎస్ఐ కిరణ్మయి, వల్లంపూడి ఎస్ఐ కె రాజేష్, వసతి గృహం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ రవికుమార్

గ్రామ దేవత ఆలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రమైన వేపాడ గ్రామంలో చెరుకు కాటా వద్ద గ్రామ దేవతైన పరదేశమ్మ, ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి మంగళవారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెలిపాక అచ్చమ్మ, నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, గ్రామ పెద్ద నరసింహమూర్తి, దేముళ్ళు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామినాయుడు పిలుపు మేరకు పట్టణంలో మెగా సోల్జర్స్, చిరంజీవి యువత ఆధ్వర్యంలో జరుగుతున్న మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో భాగంగా బుధవారం పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో మెగా సోల్జర్స్, చిరంజీవి యువత ప్రతినిధులు, ఎంటి రాజేష్, మేడేపల్లి పవన్, లోపింటి కళ్యాణ్, మజ్జి అప్పారావు, పండ్రాంకి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపిక పత్రాన్ని అందిస్తున్న జిల్లా ఉపాధి అధికారి అరుణ

జాబ్ మేళాలో 56 మంది ఎంపిక

ప్రజాశక్తి- విజయనగరం కోట

స్థానిక విటి అగ్రహారం ప్రభుత్వ ఐటిఐలో జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళాలో 56 మంది ఎంపికయ్యారు. కెఎల్ గ్రూప్ ఎస్‌కె సేఫ్టీ వింగ్స్ ప్రయివేట్ లిమిటెడ్ (అమెజాన్), ఐఐఎఫ్ఎల్ సంస్థ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఈ జాబ్ మేళాకు మొత్తం 112 మంది హాజరయ్యారు. జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ టివి గిరి, కంపెనీల హెచ్ఆర్‌లు వి.బాబ్జీ, జి.నాగేశ్వరరావు, యంగ్ ప్రొఫెషనల్ ఎం.యశ్వంత్ బాబు, జిల్లా ఉపాధి కార్యాలయం, ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

ప్రజాశక్తి - విజయనగరం కోట

అన్న క్యాంటీన్ కోసం పట్టణంలోని 34వ డివిజన్‌కు చెందిన ప్రభుత్వ మాజీ ఉద్యోగి రెడ్డి ఆదినారాయణ రూ.20వేలు చెక్కును విరాళంగా బాలాజీ వాకర్స్ క్లబ్ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజుకి బుధవారం అందించారు.

బేస్‌లైన్ ఎగ్జామ్‌ను పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలో ఉంగరాడ మెట్ట ఎపి ఎస్‌డబ్ల్యుఆర్ఎస్ 10వ తరగతి విద్యార్థులకు డిజిటల్‌గా నిర్వహిస్తున్న సిబిఎస్ఇ బేస్‌లైన్ ఎగ్జామ్‌ను ఎంఇఒ ఎంవి ప్రసాద్‌రావు బుధవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరీక్షకు 65 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎగ్జామినర్ ఈ జానకిరావు కళాశాల ప్రిన్సిపాల్ పేడాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎం.వెంకటరమణ, మృత్యుంజయరావు, జయలక్ష్మి, మధు, గుప్తా, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావులు పాల్గొన్నారు. కెజిబివి దేవుదలలో 35 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ లక్ష్మి తెలిపారు.

వరద బాధితులకు రూ.5వేలు విరాళం

ప్రజాశక్తి- బొబ్బిలి

కేరళ వయనాడ్ వరద బాధితుల కోసం పట్టణంలో సేకరించిన విరాళాలు నగదు రూ.5వేలు జిల్లా కలెక్టర్ అంబేద్కర్ కు రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అందజేశారు. వయనాడ్ బాధితులు కోసం విరాళాలు సేకరించినట్లు చెప్పారు. వయనాడ్ బాధితులను మానవత్వంతో ఆదుకోవాలని కోరారు.

సుఖ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - భోగాపురం

సుఖ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రోగ్రాం కోఆర్డినేటర్ హరినాధరావు అన్నారు. జిల్లా ఎయిడ్స్, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ముంజేరు గ్రామంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుఖ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా సమాజంలో వారితో పాటు ఏ విధంగా కలిసి జీవించాలనే విషయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూడి నూకరాజు, ఎఎన్ఎం పి.వి. తిరుమల, ఆశా వర్కర్లు బి. రాజేశ్వరి, ఆదిలక్ష్మి, సిహెచ్. భానుమతి తదితరులు పాల్గొన్నారు.

ఒకరోజు వేతనం విరాళం

ప్రజాశక్తి - భోగాపురం

నాతవలస టోల్ గేటులో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన తోటి ఉద్యోగికి ఒకరోజు వేతనాన్ని మిగతా ఉద్యోగులు విరాళంగా ఇచ్చారు. డెంకాడ మండలం మోదవలస గ్రామానికి చెందిన మంతెన పైడిశెట్టి విధులకు వస్తూ సుందరపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి మిగతా ఉద్యోగస్తులంతా కలిసి ఒక్కరోజు వేతనమైన రెండు లక్షల రూపాయలను ఆయన భార్యకు బుధవారం అందజేశారు. టోల్ గేట్ యూనియన్ ప్రెసిడెంట్ చింతపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.



నగదును అందిస్తున్న ఉద్యోగులు

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో భారత్ బంద్ బుధవారం నగరంలో విజయవంతమైంది. ఉదయం 5 గంటల నుంచి స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బస్సులు బయటకు రాకుండా గేటు వద్ద బైటాయించి నిరసన చేపట్టారు. బంద్ పిలుపు ఉండటంతో బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. బంద్ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ముందుగానే విద్యా సంస్థలు సెలవు ప్రకటించాయి. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పివి రమణ, భానుమూర్తి కార్యకర్తలు వర్గీకరణకు వ్యతిరేకంగా నినదించారు. ఎస్‌సి కులాలను విభజించే వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, మోడీ ప్రభుత్వం కారణంగానే వర్గీకరణ తీర్పు వచ్చిందని అన్నారు.

కొత్తవలస: స్థానిక మూడు రోడ్ల జంక్షన్‌లో దళిత సంఘాలు బుధవారం రాస్తారోకో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా దళిత సంఘాల నాయకులు బోని కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించగా వేలాదిమంది దళిత సంఘాలు దళితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోని కృష్ణ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలను విభజించి పాలించే ప్రభుత్వాలకు సరైన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

గుర్ల: ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా దళితలు గుర్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎయిమ్ జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తలే ఆశిరప్పడు, ఆదినారాయణ, ఎస్‌సి, ఎస్‌టి యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వంగర: ఎస్‌సి ఎస్‌టి రిజర్వేషన్ల వ్యతిరేక పోరాట సంఘం నాయకులు మజ్జి గణపతి, ఎమ్. గణపతి రావు ద్రు రాంబాబు తదితర నాయకులు వంగరలో బంద్ నిర్వహించడంతో బస్సులు రాకపోకలు నిలిచిపోయాయి. బంద్ ప్రభావంతో మండల కేంద్రంతో పాటు ఎం సీతారాంపురం, అరసాడలో



రాజాం: రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న దళితులు

దుకాణాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు మూతపడ్డాయి. మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల బంద్ ప్రభావంతో సెలవు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిర్లి రాజు, యజ్జల రాము తిర్లంగి సింహాచలం, జెన్ని చిన్న, చిత్తిరి గంగులు, చంటి, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పున:సమీక్షించాలని అంబేద్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.సాంబయ్య డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బుధవారం చేపట్టిన భారత్ బంద్ పట్టణంలో విజయవంతమైంది. ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణతో ఎస్‌సి మాలలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బంద్ సందర్భంగా విద్యా సంస్థలు మూతపడ్డాయి. రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు పహారా కాశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజాం: ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాలల ఐక్య వేదిక నాయకులు భారత్ బంద్‌ను విజయవంతం చేశారు. ఈ మేరకు బుధవారం రాజాం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలలను బంద్ నిర్వహించారు. తెల్లవారు జామున ఆర్‌టిసి బస్సులతో పాటు పలు వాహనాలను అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల దళితులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పెరుమాలి మెయిన్ సెంటర్లో, రాజాం నుండి సాలూరు వెళ్లే ప్రధాన రహదారిపై బందుకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. మండలంలోని ఎస్‌సి మాల సామాజిక వర్గం ప్రజలు, మహిళలు, విద్యార్థులు మండలం నలుమూలల నుంచి వచ్చి వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాలలు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణను ప్రభుత్వాలు అమలు చేయాలి

విజయనగరం టౌన్: సుప్రీమ్ కోర్టు ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో 29 రాష్ట్రాల ప్రభుత్వాలు వెంటనే ఎస్‌సి వర్గీకరణను విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలలో అమలు చేయాలని ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకి ఇజ్రాయెల్, జాతీయ కార్యవర్గ సభ్యులు అరసాడ రవికుమార్, గర్భాపు వర ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రామచంద్రరాజు కమిషన్ (1997)లో వర్గీకరణ డిమాండ్‌కు అనుకూలంగా నివేదికను సమర్పించగానే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే ఎస్‌సి వర్గీకరణను అన్ని రంగాలలో అమలు చేసి, మాదిగలకు, మాదిగ ఉపకులాలకు ఎంతో మేలు చేసి, మాదిగల మనసులను గెలుచుకున్నారన్నారు. మరల ఇప్పుడు ఇన్నేళ్ళకు సుప్రీంకోర్టు ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో సీయంగా చంద్రబాబు నాయుడు ఉండడం మాదిగల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. చంద్రబాబు వెంటనే స్పందించి ఎస్‌సి వర్గీకరణను తక్షణమే అమలు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి విజయనగరం జిల్లా నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోళ్లకు విఆర్‌ఎల వినతి

ప్రజాశక్తి- కొత్తవలస

లక్కవరపుకోట మండల కేంద్రంలో గల టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న విఆర్‌ఎలు అంతా కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతి పత్రాన్ని అందించారు. జిల్లా విఆర్‌ఎల ప్రధాన కార్యదర్శి రామస్వామి పేట గ్రామానికి చెందిన గట్టు వెంకన్న ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో పని చేస్తున్న సుమారు 20వేల మంది విఆర్‌ఎలలో నియోజకవర్గంలో 100 మంది వరకూ విఆర్‌ఎలు చాలీ, చాలని జీతాలతో దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సిసిఎల్‌ఎ గతంలో ఇచ్చిన రూల్స్ విరుద్ధంగా రాత్రి పూట విఆర్‌ఎలు నైట్ డ్యూటీలు చెయ్యాలని చెప్పడం దురదృష్టకరమన్నారు. తక్షణమే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్లు, విఆర్‌ఎ తదితరు పోస్టుల్లో అర్హులైన విఆర్‌ఎలను నియమించడం ద్వారా



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని ఇస్తున్న విఆర్‌ఎలు

ప్రమోషన్లు కల్పించి వారికి న్యాయం చెయ్యాలని కోరారు. తెలంగాణ మాదిరిగా విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐదు మండలాల విఆర్‌ఎలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'సీతం'లో ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం

ప్రజాశక్తి- విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన పారిశ్రామికవేత్తలు, అధ్యాపకులు, వ్యాపార, ఆవిష్కరణ ప్రపంచంలోకి ప్రవేశించడానికి ఉత్సాహంగా ఉన్న విద్యార్థులు హాజరయ్యారు. ఎమ్‌విజిఆర్ ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ప్రొఫెసర్ కెఎస్ఎస్ రామరాజు 'ఆవిష్కరణ, ఆర్థిక ప్రగతిని ప్రోత్స హించడం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడం' అనే ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవ థీమ్‌పై ప్రసంగించారు. సమాజాన్ని ఆకృతీకరిస్తున్న తాజా ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌ల గురించి విలువైన విషయాలు తెలియజేశారు. సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో, వేగంగా అభివృద్ధి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామరాజు

చెందుతున్న ఆర్థిక పరిసరాల్లో, వ్యవస్థాపకత, ఆవిష్కరణలు ఎంత ముఖ్యమో చెప్పారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ భవిష్యత్ పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడంలో విద్యాసంస్థల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. నరేంద్ర, డీన్ సిహెచ్ వెంకట లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి కిషోర్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ పి. రవి కుమార్, మేనేజ్మెంట్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్, సీతం విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - తెర్లాం

ఈ నెల 23న గ్రామాల్లో జరగనున్న గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం గ్రామ సభలను జయప్రదం చేయాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లుకు సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీ నాయకులు కార్యకర్తలు ప్రజలందరూ ఈ కార్యక్రమానికి హాజరై వారి గ్రామాభివృద్ధికి తోడ్పడేటట్లు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ ఎపిఒ సుశీల, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఈ నెల 23 నుంచి ఉపాధి హామీ పథకం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని ఎంపిడిఒ జి. గిరిబాల సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ గిరిబాల మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ



నెల్లిమర్ల: మాట్లాడుతున్న ఎంపిడిఒ గిరిబాల

పథకంలో పనులు నిర్వహించడానికి ఆయా పనులు ప్రత్యేక గ్రామ సభల్లో గుర్తించాలన్నారు. పనులకు కావాల్సిన అంచనా విలువలు తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎపిఒ జి. అరుణ కుమారి, మండల ఇంజనీరింగ్ అధికార్లు పాల్గొన్నారు.

బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సిహెచ్‌సి పారిశుధ్యం, సెక్యూరిటీ సిబ్బందికి బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సిబ్బంది బుధవారం విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 5 నెలలుగా తమకు వేతనాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు ఇవ్వకపోవడం వల్ల తమ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పలుమార్లు అధికార్లు, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళినా స్పందించడం లేదని వాపోయారు. గత మూడు సంవత్సరాలుగా పిఎఫ్ బకాయిలు మొత్తం చెల్లించాలని, ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, కాంట్రాక్టు విధానం రద్దు చేసి అప్కాస్‌లో చేర్చాలని, జిఒ 549, 43 ప్రకారం వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులు, సూపర్ వైజర్లకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో పలువురు పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

అంధులకు అన్నదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఒమ్మి మాజీ సర్పంచ్, జనసేన నాయకులు అంబళ్ల అప్పలనాయుడు, కుటుంబ సభ్యులు తన సోదరుడి పేరిట అంధులకు అన్నదానం చేశారు. బుధవారం కంచి నాయుడు 4వ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం హెలెన్ కెల్లర్ మెమోరియల్ అషోషియేషన్ ఫర్ బ్లైండ్ ఆశ్రమంలో అంధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు అంబళ్ల అప్పల నాయుడు మాట్లాడుతూ తమ సోదరుడు వర్ధంతి రోజున అనాధాశ్రయాలకు ప్రతి సంవత్సరం సాయం చేస్తున్నట్లు తెలిపారు.



అన్నదానంలో పాల్గొన్న అంధులు



ఎంఇఒకు విజ్ఞాపన పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విజ్ఞాపన పత్రం అందజేత

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని నిమ్మలపాడు గిరిజన గ్రామంలో గల పాఠశాలలో 3,4,5 తరగతులు నిర్వహించాలని కోరుతూ ఆ గ్రామం ప్రజలు ఇచ్చిన విజ్ఞాపన పత్రాన్ని మండలం విద్యా శాఖాధికారి లక్ష్మణరావుకి యుటిఎఫ్ నాయకులు బుధవారం అందించారు. విజ్ఞప్తి అందచేసినవారిలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి, జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి కేశవరావు, బొబ్బిలి మండలం ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, సహాధ్యక్షులు అప్పలనాయుడు, కోశాధికారి అనంతరావులు పాల్గొన్నారు.

నాయకులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి - విజయనగరం కోట

'మన టిడిపి' యాప్ ద్వారా తెలుగుదేశం పార్టీ కంటెంట్‌ను ప్రజలకు విస్తృత స్థాయిలో షేర్ చేసి టాప్ పెరఫార్మెర్లుగా నిలిచిన విజయనగరం నియోజకవర్గానికి చెందిన కొంతమంది కార్యకర్తలకు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సంతకం చేసి పంపించిన ప్రశంసా పత్రాలను బుధవారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు అందించారు. ఆమె మాట్లాడుతూ అందరు ఇదే ఉత్సాహంతో రాష్ట్రాభివృద్ధికి పాటు పడాలని, రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీయడానికి జగన్ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టి, ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



ప్రశంస పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే అధితి



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

గొయ్యిని పూడ్చరూ..!

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామం శిరిడి సాయి ఆలయ సమీపం పాలకొండ- రాజాం ప్రధాన రహదారికి పడిన పెద్ద గుంత కారణంగా తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ గుంతలో పడితే 108 పిలుపు తప్పదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో పాలకొండ ఆర్‌అండ్‌బి అధికారులు రోడ్డు వేసినప్పటికీ నాణ్యత లేకపోవడంతో రోడ్డు మధ్యలో గుంత పడింది. ద్విచక్ర వాహనదారులు గమనించక గుంతలో పడి గాయాలు పాలవుతున్నారు. ఎంతోమంది గాయాలపాలై మంచాన పడ్డారు. ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి గుంతని పూడ్చివేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సహజ ఎరువులను వాడాలి

ప్రజాశక్తి- గజపతినగరం

వరి పంటలో పోషక యాజ మాన్య పద్ధతుల ద్వారా రసాయనిక ఎరువులను తగ్గించి సహజ ఎరువులను వాడాలని జిల్లా వ్యవసా యాధికారి విటి రామారావు, విడిజనల్ అధికారి మహ రాజన్ తెలిపారు. మండలంలోని కొనిస గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజ మాన్య సంస్థ (ఆత్మ) ద్వారా ప్రదర్శన క్షేత్రం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుడోమొనస్, పిఎస్‌బి, కెఆర్‌బి నానో ఫాస్పరస్‌ను డ్రోన్‌తో రైతుల సమక్షంలో పిచికారి చేశారు. సహజ ఎరువుల వాడకం, వ్యవసాయ యాంత్రీకరణ వల్ల కలిగే ప్రయోజనాలు గురించి రైతులకు వివరించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, లక్ష్మణ సహజ ఎరువుల ప్రాధాన్యత తెలియచేశారు. ఈ ప్రదర్శన క్షేత్రం సీరంరెడ్డి రాంకుమార్ పొలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ధనలక్ష్మి, జిల్లా వనరుల కేంద్రం కార్యాలయం నుంచి గోవిందమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



డ్రోన్‌తో పిచికారి చేస్తున్న వ్యవసాయాధికారులు

నాలుగిళ్లల్లో చోరీ

ప్రజాశక్తి- విజయనగరం కోట

స్థానిక వైఎస్ఆర్ కాలనీలో మంగళవారం రాత్రి నాలుగిళ్లల్లో చోరీ జరిగింది. ఈ దొంగతనంలో సుమారు మూడున్నర తులాల బంగారం, రూ.1.40లక్షల నగదు, వెండి వస్తువులు చోరీకి గురైందని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఒకేచోట నాలుగు ఇళ్లల్లో దొంగతనం జరగడంతో కాలనీ వాసులు ఉలిక్కిపడ్డారు. వన్ టౌన్ సిఐ ఎస్. శ్రీనివాసరావు, క్లూస్ టిమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒక ఇంటి బయట ఉన్న సీసీ కెమెరాల్లో దొంగలు వచ్చి వెళ్లిన దృశ్యాలు పోలీసులకు లభ్యమయ్యాయని మరో ఎస్ఐ నరేష్ తెలిపారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

ప్రజాశక్తి - భోగాపురం

జాతీయ రహదారిపై ఏ రావివలస జంక్షన్ వద్ద పట్టపగలే ఒక ట్రాక్టర్ దుకాణంలోకి దూసుకుపోయింది. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. సవరవల్లి వైపు నుంచి సిమెంట్ ఇటుకలోడుతో వస్తున్న ట్రాక్టర్ ఏం జరిగిందో తెలియదు గానీ ఒకసారిగా దుకాణంలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఆ సమయంలో యజమాని దుకాణంలో కూర్చోవడంతో ప్రమాదం తప్పింది.

జెసిబి బకెట్ తగిలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భోగాపురం

పాత ఇంటిని కూల్చి వేస్తున్న సమయంలో జెసిబి బకెట్ ప్రమాదవశాత్తు తలకు తగడంతో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని రీసుపేట గ్రామంలో ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రిసు రమణమ్మ తన పాత ఇంటిని జెసిబితో కూల్చివేసే పనులు మంగళవారం రాత్రి చేపట్టారు. కూలీగా వచ్చిన బూర బంగారయ్య (55) తలకు జెసిబి బకెట్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే విజయనగరం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎ.రావివలసలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ


ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని ఏ రావివలస గ్రామంలో ఇజ్జాడ అప్పలనాయుడు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ పొలంలో మంగళవారం రాత్రి చోరీకి గురైంది. వరి పంటకు నీరు వదిలేందుకు బుధవారం ఉదయం వెళ్లి చూసేసరికి ట్రాన్స్‌ఫార్మర్ కనిపించలేదు. సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్‌ను విప్పేసి కాపర్‌ను ఎత్తుకుపోయినట్లు గుర్తించాడు. దీన్ని సుమారు రూ.2.50లక్షలు ఖర్చుపెట్టి వేయించానని తెలిపాడు. దీనిపై విద్యుత్ శాఖతో పాటు పోలీసులకు రైతు ఫిర్యాదు చేశాడు.

పూర్వ విద్యార్థులు లౌడ్ స్పీకర్ వితరణ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 10వ తరగతి 1996-97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సుధీర్, నేతాజీ, హరి, పారయ్య, తిరుపతి బుధవారం పాఠశాలకు రూ.20వేలు విలువచేసే మెగా స్పీకర్ అందజేశారు. పాఠశాలలో తల్లిదండ్రులు సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు మెగా లౌడ్ స్పీకర్ లేకపోవడంతో పూర్వ విద్యార్థులు గుర్తించి ఐదుగురు పూర్వ విద్యార్థులు ఏకమై సొంత నిధులు ఏర్పాటు చేసుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు లౌడ్ స్పీకర్ అందజేశారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలలకు ఏదో చేయాలని తపనతో ఈ లౌడ్ స్పీకర్ అందించినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ, గ్రామస్తులు, అభినందించారు.



లౌడ్ స్పీకర్‌తో పూర్వ విద్యార్థులు